# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 01-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం తమ పార్టీకి అత్యంత ప్రాధాన్యమని బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.
- పార్లమెంట్ ఉభయ సభలు పలు కీలక బిల్లులకు ఈరోజు ఆమోదం తెలిపాయి.
- కొత్త ఆర్థిక సంవత్సరం ఈరోజు నుండి ప్రారంభం కావడంతో కీలకమైన ఆర్థిక నియమాల మార్పులతో సహా పలు సంస్కరణలు అమల్లోకి వచ్చాయి.
- లక్నోలోని ఏక్నా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం తమ పార్టీకి అత్యంత ప్రాధాన్యమని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అసోంలోని గోగాముఖ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఈరోజు ఆయన ప్రసంగిస్తూ... సమ్మిళిత అభివృద్ధిని సాధించేందుకు బీజేపీ నిరంతరం మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సంరక్షణ రంగాలపై దృష్టి సారించిందని చెప్పారు. అసోంలో గత పదేళ్ల ఎన్డీఏ కూటమి పాలనలో ఆ రాష్ట్రం గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. అసోం ప్రపంచ వ్యాప్తంగా తేయాకుకు ప్రసిద్ధి చెందిందని, మోరిగావ్‌లో త్వరలో ఏర్పాటు కాబోతున్న సెమీకండక్టర్ ప్లాంట్‌తో ఇకపై ఆ రాష్ట్రం సెమీకండక్టర్ చిప్స్ రంగంలో కూడా గుర్తింపు పొందుతుందని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ స్పష్టం చేసింది. అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా రాబోయే ఖరీఫ్ సీజన్ సంసిద్ధతపై కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సమగ్ర సమీక్ష నిర్వహించి, సన్నాహాలను పూర్తి చేసిందని ఆ శాఖ అదనపు కార్యదర్శి మనిందర్ కౌర్ ద్వివేది తెలిపారు. న్యూ ఢిల్లీలో ఈరోజు నిర్వహించిన అంతరమంత్రిత్వ శాఖల పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... రాష్ట్రాలతో సమన్వయంతో నిర్వహించిన అంచనాల ప్రకారం తగినంత పరిమాణంలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అన్ని ప్రధాన పంటలకు సరిపడా విత్తన నిల్వలు సిద్ధంగా ఉన్నాయని ఆమె వివరిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

దేశంలో ముడి చమురు నిల్వలు ప్రస్తుతం తగినంతగా ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. వచ్చే రెండు నెలల అవసరాలకు తగిన ఏర్పాట్లు చేశామని, రిఫైనరీలు పూర్తిస్థాయిలో పని చేస్తున్నాయని వెల్లడించారు. 2022 ఏప్రిల్ 6 నుండి పెట్రోల్, డీజిల్ ధరలలో ఎటువంటి పెరుగుదల లేదని, 2024 మార్చిలో 2 రూపాయలు తగ్గించడం జరిగిందని గుర్తు చేశారు. అంతర్జాతీయ ధరల్లో హెచ్చుతగ్గులు ఉనప్పటికీ.. దేశీయ వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా పెట్రోల్, డీజిల్ ధరలను ప్రభుత్వం పెంచబోదని ఆమె స్పష్టం చేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ ఉభయ సభలు ఈరోజు పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపాయి. జన్ విశ్వాస్ (సవరణ నిబంధనలు) బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. అంతకుముందు ఈ బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమాధానమిస్తూ... చిన్న చిన్న కారణాలకే కేసులు నమోదవుతున్నాయని, అయితే ఈ బిల్లులో శిక్షకు బదులుగా న్యాయం అందించే నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఇకపై ప్రజలు చిన్న చిన్న విషయాల కోసం కూడా కోర్టులకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థను సరళీకృతం చేయడానికి కేంద్రం అనేక సంస్కరణలను తీసుకువచ్చిందని మంత్రి పేర్కొన్నారు. విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ చర్చలో మాట్లాడుతూ... 2023లో వచ్చిన జన్ విశ్వాస్ చట్టం మొదటి అడుగు కాగా, ప్రస్తుతం ఈ బిల్లు ఆ దిశలో మరొక కీలక ముందడుగుగా నిలుస్తుందన్నారు. సంస్కరణలు ఒకసారి జరిగే ప్రక్రియ కాదని, అవి నిరంతరంగా కొనసాగాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకి సైతం లోక్ సభ ఆమోదం లభించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును ఉదయం సభలో ప్రవేశపెట్టగా.. 2 గంటల చర్చ అనంతరం మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని సవరించేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

రాజ్యసభలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సాధారణ పరిపాలన) బిల్లు-2026కు ఆమోదం లభించింది. సెంట్రల్ ఆర్మ్ పోలీస్ ఫోర్సెస్ లోని గ్రూప్-A జనరల్ డ్యూటీ అధికారులు ఇతర అధికారుల నియామకం సేవా నిబంధనలను నియంత్రించే లక్ష్యంతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ గత వారం ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. ఈరోజు మళ్ళీ పరిశీలన ఆమోదం నిమిత్తం సభ ముందుకు వచ్చింది. కేంద్ర సాయుధ పోలీసు దళాల బిల్లు-2026లో CRPF, BSF, CISF వంటి ఐదు ప్రధాన దళాల పరిపాలనను ఏకీకృతం చేయడానికి ఈ బిల్లు ప్రతిపాదించబడింది. పార్లమెంట్ ఇన్సాల్వేన్సీ బ్యాంక్రప్సీ కోడ్ (సవరణ) బిల్లు-2026ను కూడా రాజ్యసభ ఆమోదించింది. ఇప్పటికే లోక్ సభ ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదంతో చట్ట రూపం దాల్చనుంది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో స్థూల వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మార్చ్ నెలకు గానూ 40 వేల 549 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే ఈ మార్చ్ లో మొత్తం జీఎస్టీ వసూళ్లు 8.8 శాతం పెరిగి 2 లక్షల కోట్ల రూపాయలకు పైగా చేరాయి. గత ఏడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు 1.83 లక్షల రూపాయలుగా నమోదయ్యాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది మార్చ్ లో రాష్ట్ర జీఎస్టీ వసూళ్లు 53 వేల 268 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. సమీకృత ఐజీఎస్టీ వసూళ్లు లక్ష కోట్ల రూపాయలకు పైగా నమోదయ్యాయి. ఇదిలా ఉండగా.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్థూల జీఎస్టీ రాబడులు 22 లక్షల కోట్ల రూపాయలకు పెరిగాయి. ఇది గత ఏడాది నమోదైన 20 లక్షల కోట్ల రూపాయల కన్నా 8.3 శాతం అధికం.

= = = = = = = = = = = = = = = = = = =

కొత్త ఆర్థిక సంవత్సరం ఈరోజు నుండి ప్రారంభం కావడంతో కీలకమైన ఆర్థిక నియమాల మార్పులతో సహా అనేక సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. ఆరు దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో నేటి నుండి కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025 అమల్లోకి వచ్చింది. కాలంచెల్లిన నిబంధనలను తొలగించడం, సంక్లిష్టమైన నియమాలను సరళీకరించడం, పన్ను చెల్లింపుదారుల నిబంధనలను సులభతరం చేయడం ద్వారా పన్నుల వ్యవస్థను సరళీకృతం చేయడానికి ఇది రూపొందించబడింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాల మేరకు.. దేశంలోని అన్ని డిజిటల్ చెల్లింపు లావాదేవీలు ఈ రోజు నుండి టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సవరించిన ఫాస్టాగ్ వార్షిక పాస్ రుసుము కూడా ఈ రోజు నుండి అమల్లోకి వచ్చింది. శాశ్వత ఖాతా సంఖ్య (PAN) కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి, అప్‌డేట్ చేసుకోవడానికి సంబంధించిన సవరించిన నియమాలు కూడా అమల్లోకి వచ్చాయి.

= = = = = = = = = = = = = = = = = = =

లక్నోలోని ఏక్నా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్-ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన లక్నో సూపర్ జెయింట్స్ 11 ఓవర్లు పూర్తయ్యేసరికి 5 వికెట్లు నష్టపోయి 84 పరుగులు చేసింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ అత్యధికంగా 35 పరుగులు చేశాడు.

= = = = = = = = = = = = = = = = = = =

రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి రచించిన 'టైడ్స్ ఆఫ్ టైమ్' అనే పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ న్యూఢిల్లీలో ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్లమెంట్‌లోని కుడ్యచిత్రాల కాలాతీత సౌందర్యాన్ని ఈ పుస్తకం అద్భుతంగా ప్రతిబింబించిందని పేర్కొన్నారు. సంవిధాన సదన్‌లోని 58 కుడ్యచిత్రాలు కేవలం కళాఖండాలు మాత్రమే కావని, అవి దేశ నాగరికతకు దృశ్యరూపాలని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =